www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -299 బుధవారం 4 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## అసంతృప్త నేతలను బుజ్జగించండి

### 'పురపోరు'పై మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి

**ఎక్కడ వెనుకబడ్డామో గుర్తించండి**

**రోజువారీ రిపోర్టు ఇవ్వండి**

**:నేడు మిర్యాలగూడ నుంచి ఎన్నికల ప్రచారం**

హైదరాబాద్**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**
'మన పార్టీ ఏయే మున్సిపాల్టీల్లో వెనుకబడి ఉందనే విషయాన్ని వెంటనే గుర్తించండి, అక్కడ వెంటనే రంగంలోకి దిగండి, బలోపేతానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోండిడ' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, మున్సిపల్ ఎన్నికల బాధ్యులను ఆదేశించారు. టిక్కెట్ రాలేదని అలకబూనిన అసంతృప్త నేతలను బుజ్జగించాలని ఆయన వారికి సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై ఏరోజుకారోజు రిపోర్టును తనకు అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఏఐసీసీ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వివిధ పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని మున్సిపాల్టీలకు బాధ్యులుగా ఉన్న మంత్రులు ఈ భేటీకి హాజరయ్యారు. జిల్లాల్లో నామినేషన్ల ఉపసంహరణమిగతా 2లో...



## సహనానికి దక్కిన విజయం!

### విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం

అదే ఇప్పుడు మనలను ముందకు తీసుకెళ్లింది

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ

ఎన్‌డిఎ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపిలు

2లో.



## ట్రంప్ ఒత్తిడికి ప్రధాని తలొగ్గారు

### మోడీ అమెరికాకు అమ్ముడు పోయారు -ఆదానీ కేసులో మోడీకి భయం పట్టుకుంది

**అమెరికా ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు**

న్యూఢిల్లీ**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**
అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్ వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని, నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిందని, కొన్ని కారణాల తప్ప ఏమీ మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు.మిగతా 2లో...



## వ్యవసాయ కూలీల ట్రాక్టర్ బోల్తా

**నలుగురు మహిళా కూలీలు మృతి**

**పలువురికి తీవ్ర గాయాలు**

**జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో ఘటన**



**మల్లాపూర్,ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):**
వ్యవసాయ కూలీ పనికి వెళ్లిన మహిళా కూలీల ట్రాక్టర్ బోల్తా పడటంతో నలుగురు మృతిచెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన సుమారు 12 మంది మహిళా కూలీలుమిగతా 2లో...



## 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

**లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...**

**బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్**

**చైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం**

**చైనా సరిహద్దు వివాదంపై చర్చకు పట్టుబట్టిన రాహుల్ గాంధీ**

**మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తక ప్రస్తావనపై సభలో వాగ్వాదం**

న్యూఢిల్లీ**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**
పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను మిగతా 2లో...



## ప్రకృతి వ్యవసాయ హబ్‌గా ఏపీ

**అమరావతి,ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏలూరు జిల్లాలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయిలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో మిగతా 2లో...

**ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ: సీఎం చంద్రబాబు**

**లంబసింగిలో కుంకుమపువ్వు సాగుకు ప్రణాళిక ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి**


**రైతుల కోసం డిజి రైతు బజార్, కిసాన్ డ్రోన్ యాప్‌ల ప్రారంభం**

## దేశ గోప్యతను అడ్డుకోలేరు

**వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ**

**ఇక్కడి చట్టాలను గౌరవించకుంటే వెళ్లిపోండి**

**మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం**




న్యూఢిల్లీ,**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**
ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం.మిగతా 2లో...

## 2 లక్షల ఉద్యోగాలేవి?

### రెండేండ్లుగా నియామకాలపై ముఖం చాటేస్తున్న సీఎం

**రాష్ట్రంలో జీరో రిక్రూట్‌మెంట్**

**సీఎం ముక్కునేలకు రాసినా నిరుద్యోగులు క్షమించరు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్ ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**
రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు అందలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామంటూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్‌రెడ్డి ముఖం చాటేస్తున్నారనీ, మాటతప్పినందుకు ఆయన ముక్కు నేలకు రాసినా నిరుద్యోగులు క్షమించరని అన్నారు. ఈ మేరకు మంగళశారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తొలి ఏడాది రెండు లక్షలమిగతా 2లో...




## రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ

**రోడ్డు ప్రమాదాలను నివారించేలా అవగాహన**

**ప్రతిజ్ఞ వెబ్‌సైట్ ప్రారంభంలో మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్,**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**
రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రారంభించారు. ఇది తెలంగాణలో బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన సంస్కృతిని నిర్మించే దిశగా ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. పౌరులు, తల్లిదండ్రులనుమిగతా 2లో...

# సహనానికి దక్కిన విజయం!

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3 ప్రజావినికిడి

ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు.భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.

--------------

# 2 లక్షల ఉద్యోగాలేవి?

(మొదటి పేజి తరువాయి)

నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయం డని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గాంధీ మాట అమలై ఉంటే, రేవంత్ సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదని విమర్శిం చారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి, ఫొటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో రాష్ట్రం జీరో రిక్రూట్‌మెంట్‌గా మారిపోయిందన్నారు. 1.65 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్‌ఎస్‌పై పనిగట్టు కుని బురదజల్లి అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని తెలిపారు.

**జాబ్ క్యాలెండర్‌కు పాతర**

జాబ్ క్యాలెండర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పాతరేసిందని కేటీఆర్ విమర్శించారు. వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులు, విద్యార్థులు వెంటాడుతారని తెలిపారు. మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేండ్ల నుంచి మూగబోయాయన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలనూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారనీ, సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేండ్లయినా అమలు కాకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారని చెప్పారు. ఆరు గ్యారెంటీలన్నీ గారడీలేననీ, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని విమర్శించారు.

# ట్రంప్ ఒత్తిడికి ప్రధాని తలొగ్గారు

(మొదటి పేజి తరువాయి)

నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు. మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీ శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారునాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనీయక పోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. మోదీ భయపడడానికి కారణాలను రాహుల్ వివరిస్తూ.. 'అదానీపై అమెరికాలో కేసు ఉంది. నిజానికి ఇది మోదీపై కేసు. ఎప్‌స్టీన్ ÷ల్స్‌లో చాలా విషయాలున్నాయి. దానిని అమెరికా ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆ ఒత్తిడి కూడా ఉంది. ఒత్తిడికి కారణమవుతున్న రెండు పాయింట్లు ఇవే. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

# 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

(మొదటి పేజి తరువాయి)

చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ ఛైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు.అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

# వ్యవసాయ కూలీల ట్రాక్టర్ బోల్తా

(మొదటి పేజి తరువాయి)

పసుపు రిక్కా పనికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ట్రాక్టర్‌పై గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మొగిలిపేట గ్రామానికి చెందిన మంగళరాపు లలిత(45), పెద్దిరెడ్డి గంగు(50), సంపంగి లక్ష్మి(35), రొడ్డ వైష్ణవి(15) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందగానే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో సమీప ఆస్పత్రికి తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ ప్రమాదంతో మొగిలిపేట గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ

(మొదటి పేజి తరువాయి)

రోడ్డు భద్రతకు స్పృహతో కట్టుబడి ఉండేలా ప్రోత్సహించడం, ప్రాణాలను రక్షించడం ఉమ్మడి బాధ్యత అని సురక్షితమైన అలవాట్లు ఇంట్లోనే ప్రారంభమై ప్రతి రహదారిపై కొనసాగుతాయని గుర్తించడం రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు వినియోగదారులలో క్రమశిక్షణ, అవగాహన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రోత్సహించే దార్శనికతను పునరుద్ఘాటించారు. పౌరులు ట్రాఫిక్ నియమాలను పాటించడానికి మరియు రోడ్డుపై ఉన్న ప్రతి జీవితాన్ని గౌరవించడానికి పౌర ప్రతిజ్ఞను తీసుకోవచ్చు, తల్లిదండ్రులు తల్లిదండ్రుల ప్రతిజ్ఞను ఉదాహరణగా తీసుకొని, పిల్లలలో సురక్షితమైన అలవాట్లను రూపొందించవచ్చు. ఈ చొరవ రోడ్డు భద్రత అంటే కేవలం అమలు మాత్రమే కాదని, కుటుంబాలు, పిల్లలు మరియు తెలంగాణలోని ప్రతి తోటి పౌరుడికి సమిష్టి వాగ్దానం అని గుర్తు చేస్తుంది.ఇది రోడ్డు భద్రతకు ప్రభుత్వం యొక్క బలమైన సంస్థాగత నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..విద్యార్థులకు తల్లిదంత్రులతో ఉన్న బంధాన్ని రవాణా శాఖ రోడ్డు భద్రతకు ఉపయోగించుకోవడానికి ఈరోజు రవాణా శాఖ రోడ్డు భద్రత ప్రతిజ్ఞా వెబ్‌సైట్ ప్రారంభించిందిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ప్రతిజ్ఞ రాబోయే కాలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించి కారణాలు రక్షించడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నామని పేర్కొన్నారు.రోడ్డు నిబంధనల పాటిస్తామని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర అగ్రిమెంట్ ద్వారా విద్యార్థులతో ఉన్న వారి బాండింగ్ తో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆకాక్షించారు.ఇది ఆ÷-లనైన్ లో క్షేత్ర స్థాయిలో ప్రతి మోటార్ వెహికిల్ ఉన్న వారి దగ్గరకు తీసుకుపోయి రవాణా శాఖ అధికారులు పెద్ద ఉద్యమంలో తీసుకుపోవాలి.కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య,రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్ పె÷-టటెం తదితరులు పాల్గొన్నారు.

# అసంతృప్త నేతలను బుజ్జగించండి

(మొదటి పేజి తరువాయి)

కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ సమావేశానికి హాజరు కాలేదు.

అయితే పీసీసీ చీఫ్‌కు వారు ఇదే విషయమై సమాచారమిచ్చారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూడ పలు సర్వేల ప్రకారం పార్టీ వెనుకబడి ఉన్న మున్సిపాల్టీల్లోని పరిస్థితులపై విశ్లేషించారు. తనతోపాటు మంత్రులు ఆయా ప్రాంతాల్లో ఎప్పుడెప్పుడు పర్యటించాలనే విషయాలపై ఆయన వారితో చర్చించారు. కాంగ్రెస్ వీక్‌గా ఉన్న జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలంటూ బాధ్యులకు సూచించారు. విబేధాలను పక్కనబెట్టి అందరూ సమిష్టిగా పని చేయాలని, ఓట్లు చీలకుండా చూడాలని కోరారు. పాత, కొత్త నేతలు సమన్వయంతో పని చేయటం ద్వారా కచ్చితంగా అన్ని స్థానాల్లోనూ పార్టీని గెలిపించాలంటూ దిశా నిర్దేశం చేశారు. ఈ బాధ్యత కచ్చితంగా పార్లమెంటు నియోజకవర్గ బాధ్యులదేనని స్పష్టం చేశారు. ఎన్నికలు అయిపోయేంత వరకు ఇన్‌ఛార్జిలందరూ జిల్లాలు, నియోజకవర్గాల్లో ఉండి మానిటరింగ్ చేయాలంటూ సీఎం ఈ సందర్భంగా ఆదేశించినట్టు సమాచారం. ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పీసీసీ చీఫ్‌తోపాటు వార్ రూమ్ దృష్టికి తీసుకురావాలంటూ ఆయన సూచించినట్టు తెలిసింది.



**సీఎంకు అభినందనలు**

హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనడీ స్కూల్‌లో లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల పూర్తి చేసిన సంగతి విదితమే. సమావేశంలో ఈ అంశం ప్రస్తావ-నకురాగా మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌తోపాటు మంత్రులందరూ సీఎంను అభినందించారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం ఆయన పర్యటిస్తారు. రూ.200 కోట్లతో అక్కడ ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం శంకుస్థాపన చేస్తారు. మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేసిన అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

90 శాతం స్థానాల్లో గెలుస్తాం : మహేశ్ కుమార్ గౌడ్

భేటీ అనంతరం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూడ పార్టీ తరపున పోటీ చేయబోయే 90 శాతం మంది అభ్యర్థులకు బీ-ఫామ్‌లను అందజేశామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమకు ఎవరితోనూ పోటీ లేదని, తమకు తామే పోటీ అని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంఐఎం, సీపీఐ(ఎం), సీపీఐ, జన సమితి పార్టీలతో పొత్తులుంటాయని చెప్పారు. ఒకట్రెండు నియోజకవర్గాల్లో తప్ప తమ పార్టీకి ఎక్కడా ఎలాంటి ఇబ్బందుల్లేవని స్పష్టం చేశారు. గద్వాల నేతల మధ్యనున్న సమస్యలను పరిష్కరించామని, జగిత్యాలకు సంబంధించి సీనియర్ నేత జీవన్‌రెడ్డితో చర్చిస్తామని వెల్లడించారు.

# దేశ గోప్యతను అడ్డుకోలేరు

(మొదటి పేజి తరువాయి)

ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు. మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారతదేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దేశంలోని లక్షలాది మంది పేదలు, చదువురాని ప్రజలు ప్రైవసీ పాలసీని అర్థం చేసుకోగలరా అని మెటా ప్రతినిధులను చీఫ్ జస్టిస్ సూటిగా ప్రశ్నించారు .కొన్ని సందర్భాల్లో మెటా పాలసీలు అర్థం చేసుకోవడం తమకే ఇబ్బందిగా మారుతోందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

--------------

# ప్రకృతి వ్యవసాయ హబ్‌గా ఏపీ

(మొదటి పేజి తరువాయి)

నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కోకో సిటీలో సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అన్ని ప్రక్రియలు ఒకేచోట ఉండేలా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో దీనిని అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు. దీనితో పాటు మామిడి, జీడిమామిడి, కొబ్బరి తోటల్లో కోకోను అంతర పంటగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

రాష్ట్రాన్ని దేశంలోనే అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేందుకు ముందుకొచ్చారని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులను భాగస్వాములను చేస్తూ, సాగు విస్తీర్ణాన్ని 50 లక్షల ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు.రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం ద్వారా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, వారి ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందని వివరించారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యతను ధ్రువీకరించేందుకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయాలను ఏప్రిల్ నాటికి సిద్ధం చేయాలన్నారు. సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

సంప్రదాయ పంటలతో పాటు, వాణిజ్యపరంగా లాభదాయకమైన పంటల సాగును ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా, లంబసింగి ప్రాంతంలో స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో కుంకుమపువ్వు సాగు చేపట్టే సంస్థలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. అరటి ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో ఉన్నా, ఎగుమతుల్లో వెనుకబడ్డామని, ఇకపై ఎగుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన ఆక్వా, పౌల్ట్రీ పరిశ్రమల బలోపేతానికి కూడా ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ఆక్వా రైతులు తమ సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకునే విధానాన్ని అమలు చేయాలన్నారు. పౌల్ట్రీ రంగానికి ఊతమిచ్చేలా, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టులను నేరుగా రైతులకే అప్పగించాలని నిర్దేశించారు.

ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్' వంటి టెక్నాలజీలను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. విజయవాడలో పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్ నిర్మాణానికి అంగీకారం తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం 4 ఫిబ్రవరి 2026

## 21.00 లక్షల రూపాయలతో రంగనాయకుల గుట్టలో సీసీ రోడ్ల నిర్మాణం..

### కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి..



**ప్రజావినికిడి,(హయత్ నగర్):**
హయత్ నగర్ డివిజన్‌లోని రంగనాయకుల గుట్టలో సీసీ రోడ్ల నిర్మాణానికి దాదాపు 21.00 లక్షల రూపాయలు నిధులు మంజూరు కావడంతో,స్థానిక డివిజన్ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసులు అలాగే సంబంధిత అధికారులతో కలిసి రోడ్ల లెవెల్స్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,గత 5 సంవత్సరాలుగా హయత్ నగర్ డివిజన్ అభివృద్దే లక్ష్యంగా ప్రజల మధ్యే ఉండి,ప్రతి సమస్యను ప్రత్యక్షంగా పరిష్కరిస్తూ వచ్చామని తెలిపారు. పదవీకాలం చివరి దశకు వచ్చినప్పటికీ, అభివృద్ధి పనుల్లో ఎక్కడా వెనకడుగు వేయకుండా,చివరి రోజు వరకూ ప్రజల కోసం పని చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.
అదేవిధంగా, ఒకటి,రెండు రోజుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమై, పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ కృతజ్ఞతలు కు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రంగా రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్,స్థానిక బీజేపీ నాయకులు కుమార్,స్థానికులు వెంకటేష్,వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్,అరుణ్, బీజేవైఎం నాయకులు ప్రేమ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బ్లడ్ బ్యాంక్ కాలనీలో విద్యుత్ సమస్యకు చెక్

### నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి




**ప్రజావినికిడి,(హయత్ నగర్):** హయత్ నగర్ డివిజన్ లోని బ్లడ్ బ్యాంక్ కాలనీలో గత కొంతకాలంగా లో వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉండటంతో గృహాలలోని ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతినడం, ఫ్యాన్లు,మోటార్లు సరిగా పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్యను స్థానికులు కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించారు.విద్యుత్ శాఖ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి పరిస్థితిని పరిశీలించిన కార్పొరేటర్ శాశ్వత పరిష్కారంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. దీంతో కాలనీలో విద్యుత్ సరఫరా మెరుగుపడి వోల్టేజ్ సమస్య పూర్తిగా తగ్గింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని,ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాలు అందించే దిశగా కృషి కొనసాగుతుందని తెలిపారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ కు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఏఈ ఖాదర్ అలీ, లైన్ మ్యాన్ అశోక్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, బీజేవైఎం అధ్యక్షులుఅఖిలేష్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాలు రాని వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి..

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** మంగళవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, నాగోల్ డివిజన్ పరిధిలోని పత్తుల్లాగూడ నందు 58 జీ.ఓ.క్రింద కొందరికి పట్టాలు మంజూరు చేయడం జరిగిందని,ఇంకా కొంతమందికి పట్టాలు రాలేదని,రానివారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు.అక్కడ పేద ప్రజలు దాదాపు 70-80 గజాల ఇండ్లలో నివాసం ఉంటున్నారని తెలిపారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, తమ యొక్క సిబ్బందిని పంపించి అక్కడ పట్టాలు రానివారికి పట్టాలు ఇప్పించడం జరుగుతుంది అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి పాల్గొన్నారు.

### కాటేకర్ రాణి బాయి వర్ధంతి



**ప్రజావినికిడి,(మలక్పేట్):**
కాటేకర్ రాణి బాయి వర్ధంతి వేడుకలు...స్వర్గీయ కాటేకర్ రాణి బాయి వర్ధశీతి సందర్భంగా మలక్పేట్ అందుల బాలికల స్కూల్ లో పండ్లు బిస్కెట్ ప్యాకెట్లు.... అందజేస్తున్నా సామాజిక వేత్త సైదాబాద్ బి ర్ స్ సీనియర్ నాయకుడు కాటేకర్ సుభాష్

## బోడజనంపేటలో స్వతంత్ర అభ్యర్థి రాజేందర్ సింగ్ మూడుసార్లు విజయ పరంపర



**బోడజనంపేట,03, ఫిబ్రవరి (ప్రజా వినికిడి):**
మహబూబ్ నగర్ జిల్లా బాల నగర్ మండలంలోని బోడజనంపేట గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఠాకూర్ రాజేందర్ సింగ్ స్వతంత్ర అభ్యర్థిగా మూడుసార్లు విజయం సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు.ఇదే గ్రామంలో గతంలో ఆయన భార్య కూడా ఒకసారి సర్పంచ్ గా ఎన్నికై గ్రామాభివృద్ధికి ఎన్నో సేవలందించారు.ఈ వరుస విజయాలు గ్రామ ప్రజల్లో విశేష ఉత్సాహాన్ని నింపాయి. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి వరుసగా మూడుసార్లు గెలుపొందడం అరుదైన విషయం అని స్థానికులు అభిప్రాయపడ్డారు. గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేసినందుకే ఈ విజయం సాధ్యమైందని వారు పేర్కొన్నారు. అనంతరం ఆయన అభిమానులు రాజపుత్ సమాజం బంధువులు ఆయననే అభిమానించి సన్మానించారు.ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ, ప్రజల విశ్వాసం రాజేందర్ సింగ్ పై మరింత బలపడిందని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ఆయనకు ప్రజాసేవ చేసే మరిన్ని అవకాశాలు లభించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.గ్రామ సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేసిన నాయకుడిగా ఆయనకు పేరు ఉందని తెలిపారు.సర్పంచ్ రాజేందర్ సింగ్ మాట్లాడుతూ,తన విజయానికి గ్రామ ప్రజలే కారణమని స్పష్టం చేశారు. రాజ్ పుత్ సమాజం నుంచి అపూర్వమైన సహకారం లభించిందని తెలిపారు. బోడజనంపేట గ్రామ అభివృద్దే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం,విద్యా వసతుల మెరుగుదల కోసం కృషి చేస్తానని తెలిపారు.తనపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన భావోద్వేగంగా వెల్లడించారు.ఈ సన్మాన కార్యక్రమంలో రాజ్ పుత్ సమాజం తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఠాకూర్ ఉపేంద్ర సింగ్ చౌహాన్,శుక్ రాజ్ సింగ్, మహేందర్ సింగ్, రవీందర్ సింగ్, హరిందెర్ సింగ్, జగదీప్ సింగ్, రాకేష్ సింగ్, వెంకట్ రెడ్డి,రాజ్ కుమార్ సింగ్,బుద్ధ సింగ్, రాజ్పుత్ సమాజం సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 9వ వార్డులో ప్యాట అశోక్ గెలుపు ఖాయం..

### 9వ వార్డులో భారతీయ జనతా పార్టీ భారీ ప్రచారం.. - ప్రశ్నించే నాయకుడు అశోక్ ప్యాట..

**ప్రజావినికిడి,(షాద్‌నగర్):**మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు బీజేపీ అభ్యర్థి అశోక్ ప్యాట గెలుపే లక్ష్యంగా నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి.షాద్ నగర్ మున్సిపాలిటీ లోని 9వ వార్డులో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అభ్యర్థి అశోక్ ప్యాట,భూపాల్ చారి, లక్ష్మీకాంత్ రెడ్డి, పుట్నాల సాయి శేఖర్ రెడ్డి,వంశీలతో కలిసి కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను కలుసుకున్నారు. కాలనీలోని ముఖ్యమైన వ్యక్తులను, పెద్దలను కలిసి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, మున్సిపాలిటీలో ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాయకత్వం అవసరమని, షాద్‌నగర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులే కీలకమని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుటుంబ రాజకీయాలు, అవినీతితో మున్సిపాలిటీని వెనక్కి నెట్టాయని విమర్శించారు.
కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి, 9వ వార్డు బీజేపీ అభ్యర్థి ప్యాట అశోక్ ను గెలిపించండి అని విజ్ఞప్తి చేశారు.అశోక్ విద్యార్థి దశ నుండి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించాడని యువ మోర్చా రాష్ట్ర నాయకుడి గా అనేక ప్రజా సమస్యలపై పోరాటం చేశారు ముఖ్యముగా గత ఎన్నికల్లో తక్కువ ఓట్లు తో ఓడిన కాలనీ అభివృద్ధికి కాలనీ వాసులకు 24 గంటలు అందుబాటు లో



ఉన్నాడని కాలనీ లో వేసిన రోడ్స్ కేంద్ర ప్రభుత్వం మోదీ నిధులు అశోక్ పోరాటం వల్ల జరిగిందని గుర్తు చేశారు.ఈ సారి కాలనీ వాసులు ఆశీర్వదించాలనీ మీ బిడ్డగా మీ అందరికీ అండగా ఉంటడు అని హామీ ఇచ్చారు.అశోక్ తో పాటు షాద్‌నగర్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.ప్రచారములో కాలనీ వాసులు రవి,చందూ,మనోహర్ అంజీ తదితరులు పాల్గొన్నారు.


## బీబీ నగర్ జాతీయ ఎయిమ్స్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

### వారితో కలిసి పాల్గొన్న జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర బీజేపీ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి..

**ప్రజావినికిడి(భువనగిరి):**
జిల్లాలోని బీబీ నగర్‌లో కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.1300 కోట్ల వ్యయంతో నిర్మించిన జాతీయ ఎయిమ్స్ (ఏఐఐఎంఎస్) ను ఈ రోజుకేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి సందర్శించి ఆసుపత్రి పనితీరును సమీక్షించారు.
ఈ సందర్బంగా కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి మాట్లాడుతూఇప్పటికే ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఎయిమ్స్,రాబోయే 6 నెలలలో పూర్తి స్థాయిలో పేదలకు కార్పొరేట్ తరహా వైద్యఅందుబాటులోకి రానుందని తెలిపారు.అలాగే మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తోందని,భవిష్యత్తులో కూడా పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.
ప్రస్తుతం ఎయిమ్స్ మెడికల్ కాలేజీలో 800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని,త్వరలోనే ఆయుష్ వైద్య సేవలు కూడా ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలోజిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్,
రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బుర్ర నరసయ్య గౌడ్,ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ కుమార్ మరియు జిల్లా నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ నిధులతో రూ.1300 కోట్ల వ్యయంతో నిర్మించిన జాతీయ ఎయిమ్స్ (ఏఐఐఎంఎస్) ను ఈ రోజుకేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి సందర్శించి ఆసుపత్రి పనితీరును సమీక్షించారు.
ఈ సందర్బంగా కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి మాట్లాడుతూఇప్పటికే ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఎయిమ్స్,రాబోయే 6 నెలలలో పూర్తి స్థాయిలో పేదలకు కార్పొరేట్ తరహా వైద్యఅందుబాటులోకి రానుందని తెలిపారు.అలాగే మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి



అన్ని విధాలుగా సహకరిస్తోందని,భవిష్యత్తులో కూడా పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.ప్రస్తుతం ఎయిమ్స్ మెడికల్ కాలేజీలో 800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని,త్వరలోనే ఆయుష్ వైద్య సేవలు కూడా ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలోజిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బుర్ర నరసయ్య గౌడ్,ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ కుమార్ మరియు జిల్లా నాయకులు పాల్గొన్నారు.



# మల్లాపూర్ రహదారిపై శివ హోటల్ పక్కన భారీ అక్రమ షెడ్ నిర్మాణం..

## నోటీసులు ఇచ్చి కూల్చివేతలు చేయకుండా లంచాలతో మౌనమా.?

## డ్యూటీలో నిర్లక్ష్యం చేస్తున్న చైన్ మెన్ పై చర్యలు ఉండవా.? ఉన్నత అధికారులు చోద్యం చూస్తున్నారా.?

## నాచారం సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ అవినీతి బట్టబయలు..

**ప్రజావినికిడి,(నాచారం):**
నాచారం సర్కిల్ పరిధిలోని మల్లాపూర్ ప్రధాన రహదారిపై శివ హోటల్ పక్కన భారీ అక్రమ షెడ్ నిర్మాణం జరుగుతోందని దీని వెనక టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతికి నిలువెత్తు నిదర్శనంగా మారిందని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాహన రద్దీతో నిండే ప్రధాన రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్ నిర్మాణం చేపట్టినా నాచారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు భారీగా లంచాలు తీసుకొని కళ్లుమూసుకున్నారనే ఆరోపణలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి.
ఈ అక్రమ నిర్మాణం చైన్‌మెన్ బాధ్యతారాహిత్యంతోనే కొనసాగుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రాథమికంగా అక్రమ నిర్మాణాలను అడ్డుకోవలసిన చైన్ మెన్ ఇంత భారీ షెడ్ నిర్మాణం జరిగిన ఎందుకు అడ్డుకోలేదని ఎంత భారీ స్థాయిలో అమ్ముడుపోయారో ఉన్నత అధికారులే అర్థం చేసుకోవాలని స్థానికులు పేర్కొంటున్నారు. మున్సిపల్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్న విషయాన్ని గుర్తించినప్పటికీ కేవలం నోటీసులు ఇచ్చి,లంచాలు తీసుకొని చర్యలు తీసుకోకుండా వదిలేశారని స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రోడ్డు వెడల్పు, ప్రజల భద్రత, ట్రాఫిక్ సమస్యలను పూర్తిగా విస్మరించి అక్రమ షెడ్‌కు అధికారుల మౌన



మద్దతు లభిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని విమర్శలు గుప్పిస్తున్నారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు అవినీతిలో మునిగి తేలుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందించి ఈ అక్రమ షెడ్ నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన చైన్ మెన్, అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే నాచారం సర్కిల్ మొత్తం అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



## ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన 'మిషన్ 10వ తరగతి' పోస్టర్‌ను షాద్ నగర్ వీర్లపల్లి శంకర్ ఆవిష్కరణ



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన "మిషన్ 10వ తరగతి" కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని,ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు గొప్ప ప్రోత్సాహమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ. 2.2 కోట్ల నగదు బహుమతులను విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలోషాద్ నగర్ బ్రాంచ్ మేనేజర్ నాగరాజు, ఎగ్జిక్యూటివ్స్ శివకుమార్,ప్రేమ్,డెవలప్మెంట్ ఆఫీసర్స్ బుగ్గేష్, మురళి తదితరులు పాల్గొనడం జరిగింది.

## అంబర్ పేట్ ప్రెస్ క్లబ్ కు స్థలాన్ని కేటాయించాలి..

### తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎండి సద్దాం హుస్సేన్..



**ప్రజావినికిడి,(అంబర్ పేట్):**
అంబర్ పేట్ తిలక్ నగర్ చౌరస్తా పెట్రోల్ బంక్ వెనకాల గల శ్రీ రమణ కేంద్రం 150 గజాల స్థలాన్ని అంబర్ పేట్ ప్రెస్ క్లబ్ కు కేటాయించాలని తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మొహమ్మద్ సద్దాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలో అంబర్ పేట్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో అక్రిడేషన్ అదేవిధంగా నాన్ అక్రిడేషన్‌జర్నలిస్టులు పోటీ చేయవచ్చని వారు తెలిపారు. అంబర్ పేట్ లో ప్రెస్ క్లబ్ లేక జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,మాజీ ఎంపీ వి. హనుమంతరావు , కాంగ్రెస్ అంబర్ పేట్ ఇంచార్జ్ డాక్టర్ సి రోహిన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ సంబంధించిన స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు.

# అభివృద్ధికే ఓటు..!

**జనం చూపు.. కాంగ్రెస్ వైపు..**

**ప్రగతి వెలుగుల్లో దూసుకుపోతున్న షాద్ నగర్..**

**కోడ్ కూసే దాకా కొనసాగిన పనులు..**


**పార్టీలకు అతీతంగా వార్డుల వారీగా అభివృద్ధి..**

**ఆదర్శంగా మారబోతున్న షాద్ నగర్ మున్సిపాలిటీ..**

**మున్సిపల్ పట్టణ ప్రజల మనోగతం..**

**కాంగ్రెస్ వైపే విజయ అవకాశాలు అధికం..?**

**మున్సిపల్ ఎన్నికల జోష్ లో కాంగ్రెస్..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
చరిత్ర ఎవడైనా చెప్పుకుంటారు.. కానీ మనం ముందు ఏం చేశాము.. భవిష్యత్తులో ఏం చేయబోతున్నాము చెప్పుకోగలిగేవాళ్లే అసలైన నాయకులు.. కాంగ్రెస్ పార్టీ గురించి చెప్పాలంటే స్వాతంత్ర పోరాటం నుంచి నేటిదాకా ఆ పార్టీకి ఎంతో చరిత్ర ఉంది..కానీ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పార్టీ చరిత్ర గురించి చెప్పుకొని ఓట్లు వేయించుకునే టైపు కాదు..తన గురించి తాను చెప్తాడు..ప్రజలతో చెప్పిస్తాడు..అలా అందరూ చెప్పుకునేలా మున్సిపాలిటీనీ ఆదర్శవంతంగా తీర్చిదిద్ది ఎన్నికల కోడ్ ముందు రోజు దాకా అభివృద్ధి కార్యక్రమాలు చేసి మున్సిపాలిటీ ప్రజల్లో తనదైన ముద్ర వేసిన ఘనత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు దక్కుతోంది.దీనితో మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అవలీలగా విజయం సాధించి చైర్మన్ స్థానాన్ని అధిష్టిస్తుందని ఓ వైపు సర్వేలు చెబుతున్నాయి.. ఒక్కసారి వీర్లపల్లి శంకర్ అధికారంలోకి వచ్చాక గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఒక్కసారి పరిశీలిస్తే..

## వస్తూనే ప్రగతి మార్గం..

అధికారంలోకి వస్తూనే షాద్ నగర్ కు రాజమార్గంగా చెప్పబడే పాత జాతీయ రహదారిని పట్టణం నుంచి అన్నారం వరకు బాగు చేసి దానిని బైపాస్ కు లింక్ చేసి తన పనితనాన్ని చాటాడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. అక్కడి నుంచి మొదలైన ప్రగతి కార్యక్రమాలు ఒక్కొక్కటిగా ముందుకు సాగాయి. యువకులు క్రీడలు ఆడే మినీ స్టేడియంకు కోట్లాది రూపాయలతో అదనపు హంగులు చేకూర్చేందుకు నిధులు మంజూరు చేయడం, అర్ధాంతరంగా ఆగిపోయిన వంద పడకల ఆసుపత్రికి నిధులు మంజూరు చేయించి పునరుద్ధరించడం, రూ. 184 కోట్లతో చటాన్ పల్లి రైల్వే గేట్ వద్ద వై ఆకారంలో ఫ్లైఓవర్ ఏర్పాటుకు నిధులు,తాజాగా 4.38 కోట్ల ఆడిటోరియం నిధులు వంటి కార్యక్రమాలు ఆయన ప్రత్యేకతను చాటితే దాతల సహకారానికి తన సొంత ఖర్చులను పోగుచేసి కోట్లాది రూపాయలతో ప్రభుత్వ జూనియర్ కొత్త కళాశాలకు అత్యాధునిక భవనాన్ని నిర్మించడం చరిత్రలో చెరగని సాహసం.గ్రామీణ విద్యార్థుల కోసం ఆయన చేసిన ఈ కృషి ఎప్పటికీ హృదయాల్లో నిలిచిపోతుంది. రాష్ట్రంలోని వీర్లపల్లి శంకర్ పేరు ఈ విషయంలో మారుమ్రోగి పోతుంది. ఇవే కాకుండా అగ్నిమాపక కేంద్రానికి అదనంగా రెండు ఫైర్ ఇంజన్లు, రెండు పడకల ఇళ్ల కోసం అదనంగా 6 కోట్ల నిధులు,షాద్ నగర్ లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు ఇలాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయి. జానమ్మ చెరువు అభివృద్ధి పనులకు కూడా రూ.రెండు కోట్లు మంజూరు చేసి ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇక ప్రత్యేకంగా మున్సిపాలిటీలో వార్డుల వారీగా అభివృద్ధిని పరిశీలిస్తే..


## దారులన్నీ రాజమార్గాలే..

ప్రస్తుత మున్సిపాలిటీలో వార్డుల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా మున్సిపాలిటీలో రహదారులు, కాలువల నిర్మాణ కోసం అధికారంలోకి రాగానే యూఎఫ్ఐడిసి ద్వారా రూ. 27 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులను అన్ని వార్డులకు పంచి కాలువలు, రహదారుల పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు బయో మైనింగ్ పరికరాలను ఏర్పాటు చేశారు. తాజాగా వివిధ శాఖల ద్వారా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం మొత్తంగా రూ. 35 కోట్లు మంజూరు కాగా అన్ని వార్డులలో రహదారులు, అంతర్గత కాలువల పనులు చేపట్టారు. అదేవిధంగా 8 పార్కులను అభివృద్ధి చేసేందుకు ఈ నిధులను కేటాయించారు. ఇది మాత్రమే కాకుండా ఎమ్మెల్యే తన ప్రత్యేక నిధుల నుంచి,అలాగే మున్సిపాలిటీ ఫండ్ ద్వారా కూడా అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఇక పట్టణంలో వార్డుల వారీగా విద్యుతీకరణ కార్యక్రమాలు చేపట్టి కొత్త స్తంభాలు,కాలం చెల్లిన వైర్లను తొలగించి కొత్త వైర్లు ఏర్పాటుచేసి విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపారు. ఇవి కాకుండా తాజాగా పరిగి రోడ్డు విస్తరణ కార్యక్రమం కూడా చేపట్టడం గమనార్హం.
షాద్ నగర్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో చిత్తశుద్ధితో ముందుకు సాగుతూ అనుకున్నది సాధించి ప్రగతి వెలుగులు పంచడంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముందున్నారు. ఈ క్రమంలో సర్వేలు కూడా ఆయనకు అనుకూలంగా వస్తూ కాంగ్రెస్ పవనాలు ఎక్కడ చూసినా వార్డుల్లో కనిపించడం విశేషం. ఈ ఘనత కచ్చితంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు మాత్రమే దక్కుతుంది అనేది వాస్తవం. ప్రస్తుతం అభివృద్ధికి ఓటు వేయాలన్న ప్రజాసంకల్పం పటిష్టం అయింది..

# ఎర్రగుంట చెరువులో గుర్రపు డెక్క రాజ్యం..

### పలుమార్లు వచ్చి వెళ్లిన ఎమ్మెల్యే, సమస్య మాత్రం అలాగే..-చేతులెత్తేసిన అధికారులు, కార్పొరేటర్..

### నాచారం డివిజన్‌లో యుద్ధ వాతావరణం.. -ప్రజలపై దాడులు చేస్తున్న దోమలు..



**ప్రజావినికిడి,(నాచారం):**
నాచారం డివిజన్ ప్రజలు నేడు ఒక అదృశ్య శత్రువుతో యుద్ధం చేస్తున్నారు. తుపాకులు, కత్తులు కాదు, దోమల దాడులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా దోమలు ప్రజలపై దాడి చేస్తుండగా, పాలకులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకున్నట్టు వ్యవహరిస్తున్నారునాచారం పరిధిలోని ఎర్రగుంట చెరువు నేడు చెరువు కాదు,దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువులో విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్క కారణంగా నీరు నిల్వ ఉండి, దోమలకు స్వర్గధామంగా మారింది. ఈ పరిస్థితి నెలల తరబడి కొనసాగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కను చూపులో కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### దోమలనివారణలో పూర్తిగా విఫలం

జిహెచ్ఎంసీ అధికారులు, మలేరియా విభాగం,హెల్త్ శాఖ,ఎవరి పని వారు చేస్తున్నారా.? అసలు చేయడం లేదా.? కూడా ప్రజలకు అర్థం కావడం లేదు. ఫాగింగ్ వాహనాలు కనిపించడం లేదు, లార్వా నివారణ చర్యలు శూన్యం.
దీంతో డెంగ్యూ, మలేరియా,వైరల్ ఫీవర్ ల భయంతో నాచారం ప్రజలు వణికిపోతున్నారు.

### కార్పొరేటర్ మౌనం,ప్రజల్లో ఆగ్రహం.

నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ సమస్యను అసలు పట్టించుకోకపోవడంపై స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా,సోషల్ మీడియా ద్వారా సమస్యను సమాజం దృష్టికి, అధికారుల దృష్టికి, పాలకుల దృష్టికి తెచ్చిన సమస్యపై స్పందన పూర్తిగా కరువైందని ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేటర్ కు, ఎమ్మెల్యేకుఓట్ల సమయంలో మాత్రమే ప్రజలు గుర్తొస్తారా.? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### ఎమ్మెల్యే వస్తారు. వెళ్లారు..సమస్య అలాగే

ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎర్రగుంటచెరువును పలుమార్లు సందర్శించిన అధికారులతో సమావేశాలు నిర్వహించిన గ్రౌండ్ లెవెల్‌లో మార్పు మాత్రం శూన్యం. ఫోటోలు,హామీలే తప్పసమస్యను ఏనాడు పరిష్కరించిన దాఖలాలు లేవని దానితో ప్రజలకు ఊరట ఏమాత్రం లభించలేదు. దీంతో "సమస్య పరిష్కరించలేని ఎమ్మెల్యే ఎందుకు.?"అనే ప్రశ్న ప్రజల్లో మోగుతోంది. దోమలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని అనారోగ్య బారిన పడుతున్న కుటుంబాలుదోమల కారణంగా పిల్లలు,వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు నిద్ర లేక, పగలు పనులకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది అన్నారు. దోమ కాట్లతో మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వచ్చి ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చు అవుతున్నా, ప్రభుత్వం నుంచి కనీస సహాయం లేదని తక్షణమే చర్యలు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని పేర్కొంటున్నారు. ఎర్రగుంట చెరువులోని గుర్రపు డెక్కను వెంటనే తొలగించి నిత్యం ఫాగింగ్, లార్వా నివారణ చర్యలు చేపట్టాలని దోమల నివారణ పై వస్తున్న విధులను స్వాహా చేస్తున్నారని ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని నాచారం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైన పాలకులు మేల్కొనకపోతే నాచారం డివిజన్ ప్రజలు దోమలతో పాటు స్థానిక కార్పొరేటర్, ఎమ్మెల్యే, అధికారులతో యుద్ధం మరింత భీకరంగా చేయడం ఖాయం.



# అప్పుడు అరాచకం..
# ఇప్పుడు ఆరాటం!

**- నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి..**
**ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత నాదే**
**- గత పాలకుల నిర్లక్ష్యంపై మంత్రి పొంగులేటి నిప్పులు..**
**ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హామీల వర్షం..**



**ప్రజావినికిడి ,(ఏదులాపురం):** అధికారంలో ఉన్న పదేళ్లు నిరుపేదల ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా అరాచకంగా వ్యవహరించిన వారు.నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారు.అని తెలంగాణ రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7,8,9, 12,13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో ఆయన పాల్గొని విపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. గత పాలకులు పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేశారని, ఆనాడు అర్హులైన వారికి స్థలాలు ఇవ్వకుండా వంచించారని ఆయన మండిపడ్డారు.

**సొంతింటి కలను నెరవేరుస్తాం**

ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి ప్రజలకు కీలక భరోసా ఇచ్చారు. ఇళ్ల స్థలాలు ఇచ్చే మంత్రిని కూడా నేనేనని,ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, వాటిలో ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు.ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఏప్రిల్ నుంచి వరుస విడతల్లో ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించనని హామీ ఇచ్చారు.

**సంక్షేమ పథకాలతో పేదల చెంతకు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి వివరించారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైన్ల పనులను వేసవి లోపే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.తనను అసెంబ్లీ ఎన్నికల్లో దీవించినట్టే, ఏదులాపురం మున్సిపాలిటీ బరిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు.



# శ్రీవారి నెయ్యి కల్తీపై విచారణ కమిషన్

## శ్రీవారి నెయ్యి కల్తీపై కేబినెట్ సుదీర్ఘ సమీక్ష

**కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు**
**కల్తీ సంగతి తెలిసీ మౌనంగా వైకాపా పాలకులు**
**సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారు**
**కేబినెట్ వివరాలను వెల్లడించిన మంత్రులు**




**అమరావతి,ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**

కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ మంత్రి వర్గ సమావేశం ముగిసిన తర్వాత మంత్రులతో కలిసి పయ్యావుల మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు పక్కనపెట్టి మరీ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మూడు గంటలపాటు కొనసాగిన క్యాబినెట్ భేటీలో సిట్ నివేదికపైనా చర్చ జరిగింది. ఆ నివేదికలో పాత్రధారులపైనే చర్యలకు సిట్ సిఫార్సు చేసిందని అభిప్రాయపడింది. సిట్ విచారణ, ఛార్జ్‌షీట్, ప్రభుత్వానికి సమర్పించిన అంశాల్లో తేడాలను మంత్రివర్గం గుర్తించింది. ఈ మూడింటిపై అధ్యయనం చేసి వాస్తవాల సమర్పణకు కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విచారణలో ఉన్న వాస్తవాలు ఛార్జ్‌షీట్‌లో ఎందుకు నమోదు చేయలేదనే దానిపై సమావేశంలో చర్చ జరిగింది. సిట్ నివేదికలోని లోపాలను సరిచేసి, అసలు సూత్రధారులను కనుగొనేందుకు కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని కేబినెట్ నిర్ణయించింది. అప్పట్లో పర్చేస్ కమిటీకి సభ్యులు కాని భూమన కరుణాకర్ రెడ్డిని ప్రత్యేక ఆహ్వానితుడిగా పిలిచారని సీఎం చంద్రబాబుకు మంత్రులు వివరించారు. అయితే, ఆనాడు కమిటీ సభ్యులుగా ఉన్న తనను, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని పిలవలేదని మంత్రి పార్థసారథి చెప్పారు. రసాయనాల మిశ్రమం కలిసిన లడ్డూలను అయోధ్యకు కూడా పంపారని కేబినెట్‌లో అధికారులు పేర్కొన్నారు. నెయ్యి టెండర్ నిబంధనలను మార్చడంపైనా మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్ దక్కించుకున్నారని, టెండర్ నిబంధనలను మార్చినప్పటికీ ఈఓగా ఉన్న సింఘాల్ అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంపై పలువురు మంత్రులు ప్రశ్నలు లేవనెత్తారు. 2022లో సీఎఫ్‌టీఆర్ఐ నివేదికలో నెయ్యి కల్తీ జరిగిందని నివేదిక వచ్చినా పట్టించుకోకపోవడంపై చర్చించారు. అప్పటి అధికారులు బాలాజీ, సుబ్రహ్మణ్యం దానిని పక్కన పెట్టారని నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌డీడీబీ నివేదికలో యానిమల్ ఫ్యాట్ ఉందని తేలిందని, అదే విషయాన్ని ముఖ్యమంత్రి చెప్పారని మంత్రులు తెలిపారు. సిట్ నివేదికలో కొంతమంది పేర్లు పేర్కొన్నప్పటికీ, చివరి ఫైడింగ్స్‌లో వాటిని పేర్కొనకపోవడంపై చర్చ జరిగింది. ఈ లోపాలన్నింటిపై కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని కేబినెట్ నిర్ణయించింది. కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ నివేదికను సాధ్యమైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించింది. టెండర్ ప్రక్రియలో లోపాలపై దృష్టి సారించాలని కమిటీకి మంత్రిమండలి సూచించింది. సహకార డెయిరీలను పక్కన పెట్టేందుకు పథకం రూపొందించారని కేబినెట్ పేర్కొంది. సహకార డెయిరీలను పక్కన పెట్టడం ద్వారా బోగస్ డెయిరీలను రంగంలోకి తీసుకువచ్చారని అధికారులు వివరించారు. దీనిపైనా ఎంక్వైరీ కమిటీ దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. అడ్వకేట్ జనరల్, సీనియర్ అధికారుల అభిప్రాయాలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అప్పటి చైర్మన్ సుబ్బారెడ్డి పాత్ర గురించి సిట్ నివేదికలో ఏమైనా పేర్కొన్నారా? అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఛార్జ్‌షీట్‌లో యానిమల్ ఫ్యాట్ ఉందని పేర్కొన్నారా? అని కూడా పవన్ అడిగారు. ఛార్జ్‌షీట్‌లోని 35వ పేజీలో స్పష్టంగా పేర్కొన్నారని పవన్‌కు చెప్పారు అధికారులు. అసలు సూత్రధారులను వెంటనే తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. సిట్ నివేదికలో లోపాలు ఉన్నాయని, అసలు సూత్రధారులను బయటకు తీసుకురాలేకపోయిందని మంత్రులు పేర్కొన్నారు. అందువల్ల వెంటనే అసలు సూత్రధారులపై ఫోకస్ పెట్టాలని మంత్రులు చెప్పారు. ఈ విషయాలను బహిర్గతం చేసేందుకే కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించామని ముఖ్యమంత్రి తెలిపారు. నివేదిక వచ్చిన వెంటనే ఎవరిపై చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

**వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు**

**అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు**

హైదరాబాద్,**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి** : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 -27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సచివాలయంలో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహణ



హైదరాబాద్/**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి** :డా. బి.ఆర్. అంబెద్కర్ తెలంగాణా సచివాలయంలో ఉదయం ఫైర్ మాక్ డ్రిల్ ను నిర్వహించారు. ప్రమాద వశాత్తు ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే చేపట్టాల్సిన చర్యలు, అగ్ని మాపక పరికరాలను ఏవిధంగా ఉపయోగించాలి తదితర అంశాలపై నేడు ఉదయం చేసిన మోక్ డ్రిల్ లో వివరించారు. సచివాలయం సీఎస్ఓ దేవీ దాస్, అసిస్టెంట్ కమాండెంట్స్ అప్పాజీ, పవన్ కుమార్, ఏ.డి.ఎఫ్.ఓ జీ.వి. ప్రసాద్, ఎస్.ఎఫ్.ఓ జాన్యాలతోపాటు సచివాలయానికి చెందిన దాదాపు 100 టీ,జి.ఎస్.పి.ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

------------

# వరంగల్ జూలో తెల్లపులి మృతి

**వృద్ధాప్యం కారణమని తెలిపిన అధికారులు**

వరంగల్,/**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**



నగరంలోని హంటర్ రోడ్డు కాకతీయ జూలజికల్ పార్క్ లో వైట్ టైగర్ (శరణ్) మంగళవారం తెల్లవారుజామున ఎక్లోజర్ లో చనిపోయింది. వృద్ధాప్యం, మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్ తో చనిపోయిందని జూ అధికారులు అంటున్నారు. మంగళవారం పులి అంత్యక్రియలు చేసినట్లు జూపార్క్ పర్యవేక్షణ అధికారి మయూరి తెలిపారు. అయితే అధికారుల మెంటనెన్స్ సరిగా లేకనే రెండు రోజులుగా అనారోగ్యానికి గురై చనిపోయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జూ పార్క్ నుంచి తెల్ల పులిని జూలై మాసంలో వరంగల్ తీసుకొచ్చారు. పులి సంరక్షణ సరిగా లేకనే అనారోగ్యానికి గురై మృత్యు వాత పడినట్లు సమాచారం. అధికారులు మాత్రం పులి అనారోగ్యం, గుండె పోటుతో చనిపోయిందని చెబుతున్నారు. జిల్లా అధికారులు పులి మృతి విషయం గోప్యన్గా ఉంచి, అంత్యక్రియల తరువాతనే అనారోగ్యంతో మృతి చెందినదని జూ అధికారి చెప్పడం గమనార్హం.

## నేడు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ భేటీ

హైదరాబాద్,**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి** :వెనుకబడిన తరగతుల సమగ్ర అధ్యయనంలో భాగంగా వివిధ ప్రభుత్వ విభాగాల నుండి బీసీ కమిషన్ సమాచార సేకరణ చేస్తుంది. ఇందులో భాగంగా విద్యా సంబంధిత విషయంలో సమాచార సేకరణ కొరకై సంబంధిత విభాగ అధిపతులతో రేపు కమిషన్ భేటి కానుంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు జరిగే సమావేశంలో విద్యాశాఖకు చెందిన వివిధ విభాగ అధిపతులను ఈ సమావేశానికి హాజరు కావాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల వివరాల సేకరణకు సంబంధించిన అంశాలపై కమిషన్ చర్చించనుంది.

-------------

# మేయర్ / చైర్మన్ ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**



**రంగారెడ్డి ఫిబ్రవరి 3 ప్రజావినికిడి )**2వ సాధారణ మున్సిపల్ కార్పొరేషన్ / మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా మేయర్ / చైర్మన్ ఎంపిక ప్రక్రియను పూర్తిగా నిబంధనల ప్రకారం, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు.సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో మున్సిపల్ ఎన్నికలలో భాగంగా మేయర్ / చైర్మన్ ఎంపిక ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ, 2వ సాధారణ మున్సిపాలిటీ / మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్లు స్వీకరించామని, అభ్యంతరాలు, ఉపసంహరణల అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వెంటనే గుర్తుల కేటాయింపు చేసి బ్యాలెట్ పేపర్ల ముద్రణకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఈ నెల 11వ తేదీన పోలింగ్, అవసరమైతే 12వ తేదీన రీపోలింగ్, 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. ఫలితాల అనంతరం మేయర్ / చైర్మన్ ఎంపిక ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఎంపికైన అధికారులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో అందించనున్నట్లు తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణను అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మేయర్ / చైర్మన్ ఎంపిక ప్రక్రియను నిబంధనల ప్రకారమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డి.ఆర్.ఓ సంగీత, పి.డి. మెప్మా వెంకట్ నారాయణ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎపిలో కల్తీ నెయ్యి మంటలు !

**అమరావతి,ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**

తిరుమల కల్తీ నెయ్యి రాజకీయంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు పరాకాష్టకు చేరాయి. విమర్శలు, ప్రతి విమర్శలు కాస్తా దాడుల వరకు పోయాయి. పరస్పర విమర్శలు కూడా హద్దులు దాటాయి. ఇళ్లను తగులబెట్టడం, ఇళ్లపై దాడులు చేయడం వంటి దారుణాలు చూస్తున్నాం. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇలాంటివి చూశాం. ఇప్పుడు చంద్రబాబు పాలనలోనూ ఇలాంటివి చోటు చేసుకోవడం సిగ్గుచేటు. రాజకీయంగా ఎన్ని విమర్శలు చేసినా ఫరవాలేదు. కానీ దాడులకు తెగించడం మాత్రం సరికాదు. జోగిరమేశ్ ఇంటిపై పెట్రో బాంబు విసిరి తగులబెట్టే యత్నం చేయడం వాంఛనీయం కాదు. అలాగే అంబటి రాంబాబు ఇంటిపైనా దాడిచేసి కారును, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. గతంలో నెల్లూరు జిల్లాలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపైనా దాడికి తెగించారు. ఇదంతా ప్రజాస్వామ్యంలో వాంఛనీయం కాదు. ఇలాంటి దాడులతో ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో కూటమి నేతలు చెప్పాలి. ఓ రకంగా చెప్పాలంటే తిరుమల లడ్డూకు సంబంధించి కల్తీనెయ్యి సరఫరా వ్యవహారంలో తాజాగా సిబిఐ ఇచ్చిన నివేదక ఆజ్యం పోసిందని చెప్పాలి. కల్తీ జరగలేదని సిబిఐ చెప్పినట్లుగా వైసిపి నేతలు చేస్తున్న ప్రచారం కూడా పరాకాష్టకు చేరింది. తిరుమల దేవదేవుడిని మోసం చేయడంలో అందరూ ముందున్నారు. తిరుమల శ్రీవారిని దోచుకునేందుకు అందరూ ప్రయత్నించారు. దేవుడి



డబ్బుపై కన్ను పడిన వైకాపా అక్కడ చేయని ఘోరం లేదు. ఇకపోతే కల్తీనెయ్యిపై విచారణ సాగుతోంది. సిట్ అన్నింటిని పరిగణించి దర్యాప్తు చేస్తోంది. తాజాగా ఇవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కూడా బదిలీ చేశారు. అయితే ఈ వ్యవహారంలో పరస్పర దూషణలు, దాడుల వరకూ వెళుతున్న తీరు మాత్రం సభ్యసమాజం సిగ్గుపేడేలా చేసింది. అసలు కల్తీ తీవ్రతపైన సిబిఐ వెల్లడించిన విస్తృతాంశాలను వదిలేసి ఒక్క అంశమే తీసుకుని తాము నిర్దోషులమని చెప్పుకోవడానికి వైసిపి నేతలు రెచ్చిపోయి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీసిందని చెప్పాలి. అలాగే మాజీ సిఎం జగన్ కూడా తిరుమల వ్యవహారాన్ని చాలా చిన్నదిగా చేసి మాట్లాడిన తీరు కూడా సగటు భక్తుడి మనోభావాన్ని దెబ్బతీసింది. ఈ రెండు పార్టీల కుమ్ములాటల్లో ప్రజాసమస్యలన్నీ పక్కదోవ పట్టడం రోజూ చూస్తున్నాం. రాష్ట్రంలో ఎవరు అధికారంలో వున్నా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఇది సహజంగా మారింది. కానీ కల్తీ నెయ్యి అంశం మాత్రం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నది నిజం. వేలకోట్లకు అధిపతిగా ఉన్న దేవదేవుడి లడ్డూ ప్రసాందం కల్తీనెయ్యితో తయార య్యిందన్న వార్త ఇప్పటికీ జీర్ణించుకోలేనిదిగా మారింది. గతంలో ఆనాటి ప్రధానార్యకులు రమణదీక్షితులు పింక్ డైమండ్లు మాయం అయ్యాయని అన్నారు. ఆలయ భూములు, పూజా పద్ధతులు, నియామకాలతో సహా చాలా సమస్యలు వివాదం అయ్యాయి. వైకాపా హయాంలో తిరుమల పవిత్రతను దెబ్బతీయడం వంటి ఆరోపణలు ముందుకొచ్చాయి. 2024 మేలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి తొలిసారి తిరుమల సందర్శనలోనే అన్నీ ప్రక్షాళన చేస్తానని ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శ్యామలరావును నియమించారు. ఆ తరవాత తిరుమల లడ్డూ కోసం ఉపయోగించే నెయ్యిలో 'జంతువుల కొవ్వును వాడే పరిస్థితికి వచ్చారని' ఆరోపించడంతో దుమారం చెలరేగింది. జంతువుల కొవ్వు, పంది కొవ్వు కలిసినట్టు తేలిందని ప్రకటించడమేగాక టిటిడి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై ప్రభుత్వం సిట్‌ను నియమించడం, నెలాఖరుకల్లా సిట్ రంగంలోకి దిగి దర్యాప్తు మొదలెట్టడం జరిగి పోయాయి. ఈ క్రమంలో మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చంద్రబాబు నియమించిన సిట్‌తో కాకుండా సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీం కోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఏ దర్యాప్తు లేకుండా లడ్డూలో కొవ్వు కలిసిందని ఆరోపించి భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమేమిటని తీవ్రంగా ఆక్షేపించింది. దేవుడిని రాజకీయాల్లోకి లాగవద్దని హితవు చెప్పింది. సిబిఐ మొత్తం 12 రాష్ట్రాల్లో అనేక మందిని విచారించింది. ఛార్జిషీటులో 36 మందిని నిందితులుగా పేర్కొంది. ఉత్తరాఖండ్‌లోని భోలే బాబా డెయిరీ నడిపే విపిన్ జైన్, పోమిల్ జైన్‌లను ప్రధాన కారకులుగా తేల్చింది. మొత్తం మీద రాజకీయంగా పాలక పార్టీలు ఏవైనా కొండ మీద అవినీతి సాగుతున్నదని దీన్నిబట్టి తెలుస్తున్నది. నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందని, అసలది నెయ్యి కాదని తేల్చి చెబుతూనే కొవ్వు కలిపారనడానికి ఆధారం లేదని సిబిఐ నిర్ధారించడంతో యుద్ధం మొదలయ్యింది. తాము పరిశీలించిన నమూనాలలో నిజమైన నెయ్యి చాలా తక్కువగా వుందనీ, పామాయిల్, పామ్‌స్టెయిన్, ఇతర కృత్రిమ పదార్థాలు రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. కొవ్వు కలిపినట్టు చెప్పే అవకాశాలు దాదాపు లేవని, పంది కొవ్వు కలిపిన ఛాయలు అసలే లేవని పేర్కొంది. భోలే బాబా డెయిరీ పాలు, నెయ్యి సేకరించిన దాఖలాలే లేవనీ, మొత్తం కల్తీ కృత్రిమ నెయ్యి తతంగమేనని దీంతో స్పష్టమయ్యింది. ఇదే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్న రీతిలో ఎగిరి గంతేసిన వైసిపి నేతలైతే జగన్‌తో సహా తమ తప్పే లేనట్టు మాట్లాడుతున్నారు. ప్రాయశ్చిత్త హోమాలు, ఆలయ సందర్శనలు చేపట్టారు. ఫ్లెక్సీల పంచాయితీలు తిట్ల స్థాయికి దిగజారుతున్నాయి. నెయ్యిలో కొవ్వు లేదన్నది నిజమేగానీ, అందులో రసాయనాలు కలిపి నెయ్యి పేరిట 200 కోట్ల రూపాయల పైన సరఫరా చేయడం మాత్రం నిజం అన్నది ఇక్కడ గమనించాలి. కల్తీ జరిగిందన్నది కూడా నిజం. ఎవరు అధికారంలో ఉన్నా తిరుమలలో దారుణాలు సాగుతున్నాయి. అయితే ఇవన్నీ రాజకీయ విమర్శలను పరాకష్టకు చేర్చాయి. చివరాఖరుకు దాడుల వరకు వెళ్లాయి. ఇలాంటివి జరగడం సరికాదు. రేపు మరోకరు అధికారం లోకి వస్తే మరిన్ని దాడులు జరగవని చెప్పలేం. అందువల్ల ఇలాంటి దాడి రాజకీయాలను తిప్పి కొట్టాల్సిందే.

# ఎకరా భూమి కోసం దారుణం

### సవతితల్లి, సోదరుడి దారుణహత్య

### హత్యలతో గ్రామంలో తీవ్ర విషాదం

అనంతపురం,**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**

అనంతపురం జిల్లాలోని శింగనమల మండలం తరిమెల గ్రామంలో దారుణ ఘటన జరిగింది. ఆస్తి వివాదాల నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అత్యంత అమానుషంగా హత్యకు గురయ్యారు. తరిమెల గ్రామానికి చెందిన నల్లప్ప అనే వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉన్నారు. నల్లప్ప మరణించిన తర్వాత ఆయనకు సంబంధించిన ఆస్తి పంపకాల విషయంలో మొదటి భార్య పిల్లలకు, రెండవ భార్యకు మధ్య గత కొంతకాలంగా తీవ్ర వివాదాలు నడుస్తున్నాయి. ఈ వివాదాలే ఇప్పుడు హత్య వరకు దారితీశాయి. నల్లప్ప రెండవ భార్య యల్లమ్మ(38) స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తున్నారు. యల్లమ్మ సహా ఆమె కుమారుడు చిన్నా(22)లను దారుణంగా చంపేశారు.

కొద్ది కాలం నుండి ఆ ఎకరా పొలంలో మాకూ సగం కావాలంటూ పెద్ద భార్య లక్ష్మీదేవి కొడుకులు ఇద్దరు ఎల్లమ్మతో గొడవ పడుతుండేవారు. ఆ గొడవల వల్ల



సోమవారం అర్ధరాత్రి సమయంలో ముందస్తు ప్లాన్‌తో ఎల్లమ్మ ఆమె కొడుకు చిన్న ఇద్దరు ఇంటిలో నిద్రిస్తున్నప్పుడు ఒక్కసారిగా లక్ష్మీదేవి కొడుకులు ఓంకార్, జగజ్జీవన్ ఇద్దరూ వేటకొడవళ్ళతో వచ్చి ఎల్లమ్మ కొడుకును నరికారు. ఎల్లమ్మను వెంటాడి ఆమె తల నరికి తలను తీసుకొని గ్రామంలో ఉన్న నాగుల కట్ట మీద పెట్టి ఎవరైనా రండిరా ..! అంటూ పెద్దగా కేకలు వేస్తూ

లక్ష్మీదేవి కుమారులు రెచ్చిపోవడంతో గ్రామ ప్రజలు భయపడి ఇంటిలో నుంచి బయటికి ఎవరు కూడా రాలేకపోయారు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి గాలిస్తున్నారు. మొదటి భార్య కుమారులే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ప్రాథమిక సమాచారం. భూమి లేదా ఇతర ఆస్తుల పంపిణీలో తలెత్తిన ఘర్షణలే ఈ జంట హత్యలకు ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల విచారణ ప్రకారం.. హత్య సమాచారం అందిన వెంటనే పోలీసులు తరిమెల గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఈ రెండు హత్యలతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ కలహాలు ప్రాణాలు తీసే స్థాయికి వెళ్లడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తి కోసం కనికరం లేకుండా ప్రాణాలు తీయడం సమాజంలోని నైతిక విలువల పతనాన్ని సూచిస్తోంది. ఆస్తి తగాదాల నేపథ్యంలోనే ఈ హత్యలు జరిగినట్లు ప్రాథమికంగా తేలిందని పోలీసులు వెల్లడించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని జిల్లా పోలీసులు తెలిపారు.

## చంద్రబాబు, సోమిరెడ్డిలపై దుర్భాషలు

### మాజీమంత్రి కాకానికి పోలీసుల నోటీసులు

నెల్లూరు,,**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**




మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిపై మరోమారు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు అధికారులు నోటీసులు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో పరుష పదజాలంతో దుర్భాషలాడిన ఆరోపణలపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో నెల్లూరు రూరల్, పొదలకూరు, మనుబోలు పోలీస్ స్టేషన్లలో కాకాణిపై కేసులు నమోదయ్యాయి. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే సోమిరెడ్డి తల్లిదండ్రులపైనా కాకాణి దుర్భాషలాడారు. ఈ నేపథ్యంలో పోలీసులు మంగళవారం కాకాణి నివాసానికి వెళ్లి, ఆయనతో మాట్లాడిన అనంతరం నోటీసులు అందజేశారు. ఈ కేసుల్లో విచారణకు సహకరించాలని, అవసరమైన వివరాలు అందించాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనతో నెల్లూరు జిల్లాలో రాజకీయం మరింత వేడెక్కింది. పోలీసులు నోటీసులు ఇచ్చారని.. సాయంత్రమే విచారణకు రావాలని చెప్పారని మాజీ మంత్రి కాకాణి తెలిపారు. తాను సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు గాను విచారణకు పిలిచినట్లు చెప్పుకొచ్చారు. అయితే, ఏ అంశంలో తాను ఆరోపణలు చేశానో స్పష్టంగా చెప్పాలని పోలీసులను అడిగినట్లు తెలిపారు. ఏ అంశంలో విచారణకి రమ్మంటున్నారో చెబితే, వాటికి సంబంధించిన ఆధారాలు తీసుకువెళతానన్నారు. ఎఫ్ఐఆర్‌లో ఏ అంశం ఉందనేది స్పష్టత లేదన్నారు మాజీ మంత్రి. కేసుకు సంబంధించిన వివరాలు ఇస్తే, విచారణకు హాజరవుతానని కాకాణి గోవర్ధన్ స్పష్టం చేశారు.

-----

## వీఎస్ఆర్ కంపెనీకి విమానయానశాఖ షాక్

### అజిత్ పవార్ విమాన ప్రమాదంపై డిజిసిఎ దర్యాప్తు

### బ్యాలెన్స్ షీ, లాగ్ బుక్‌ను చెక్ చేయనున్న అధికారులు



న్యూఢిల్లీ,,**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) దర్యాప్తును ముమ్మరం చేసింది. వీఎస్ఆర్ వెంచర్స్‌పై స్పెషల్ ఆడిట్‌కు ఆదేశించింది. ఫిబ్రవరి 15వ తేదీలోగా ఆడిట్ పూర్తి చేసే అవకాశం కనిపిస్తోంది. ఆడిట్‌లో భాగంగా వీఎస్ఆర్ కంపెనీకి చెందిన బ్యాలెన్స్ షీట్స్, లాగ్ బుక్స్‌ను అధికారులు చెక్ చేయనున్నారు. ఈ చెకింగ్స్ ద్వారా ప్రమాదానికి గురైన విమానానికి సంబంధించిన మెయిన్‌టెన్స్ వివరాలు తెలుసుకో నున్నారు. ప్రోటోకాల్ ప్రకారం లాగ్ బుక్ ఫిల్ చేస్తున్నారా? లేదా గుర్తించనున్నారు. మరో వైపు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) కూడా ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తోంది.కాగా, అజిత్ పవార్ లియర్‌జెట్ 45చీఖీ విమానంలో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురయ్యారు. ఈ లియర్‌జెట్ 45చీఖీ విమానం వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినది. విమానాలను అ÷-దదెకు ఇచ్చే అతి పెద్ద సంస్థలలో వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ఒకటి. ప్రమాదం జరిగిన తర్వాత సంస్థ యజమాని వీకే సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. 'నా దగ్గర ఉన్న విమానాలు అన్నీ చాలా మంచి కండీషన్‌లో ఉన్నాయి. అలాంటి వాటిని ఎందుకు నిలిపివేస్తాను. లియర్‌జెట్ విమానాలకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది. అలాంటి వాటిని నేను కచ్చితంగా నిలిపివేయను' అని స్పష్టం చేశారు. అజిత్ అనంతరావు పవార్ జనవరి 28వ తేదీన బారామతిలో జరిగే ఓ కార్యక్రమానికి వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లియర్‌జెట్ 45చీఖీ విమానంలో బయలుదేరారు. బారామతి ఎయిర్‌పోర్టు వద్ద విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ల్యాండ్ కావాల్సిన విమానం మళ్లీ గాల్లోకి లేచింది. ఉదయం 8.45 గంటల సమయంలో నేలపై పడి పేలిపోయింది. అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ఈ ప్రమాదంలో చనిపోయారు.

----------

## మరోమారు పసిడి ఝలక్

### తగ్గినట్లే తగ్గి పెరిగిన బంగారం, వెండి రేట్లు

హైదరాబాద్,**ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**

తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర 1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.



## భారత శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ.. ఒకే పరికరంతో సౌరశక్తి సంగ్రహణ, నిల్వ



**అమరావతి,ఫిబ్రవరి 3 ప్రజావినికిడి**

క్లీన్ ఎనర్జీ రంగంలో భారత శాస్త్రవేత్తలు ఒక కీలక మైలురాయిని సాధించారు. సౌరశక్తిని గ్రహించడంతో పాటు దానిని నిల్వ చేయగల పరికరాన్ని (సింగిల్ యూనిట్) అభివృద్ధి చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ)కి చెందిన బెంగళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మ్యాటర్ సైన్సెస్ పరిశోధకులు ఈ ఘనత సాధించినట్లు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.సాధారణంగా సోలార్ సిస్టమ్స్‌లో శక్తిని గ్రహించడానికి, నిల్వ చేయడానికి వేర్వేరు యూనిట్లు అవసరమవుతాయి. దీనివల్ల ఖర్చు పెరగడంతో పాటు శక్తి నష్టం కూడా జరుగుతుంది. అయితే, ఈ కొత్త పరికరంతో ఆ రెండు పనులూ ఒకే యూనిట్‌లో జరిగిపోతాయి. 'ఫోటో-రీఛార్జబుల్ సూపర్ కెపాసిటర్'గా పిలిచే ఈ పరికరం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా సామర్థ్యం కూడా పెరుగుతుంది.

నికెల్-కోబాల్ట్ ఆక్సైడ్ నానోవైర్ల సహాయంతో ఈ పరికరాన్ని అభివృద్ధి చేశారు. ఈ ప్రత్యేక నిర్మాణం వల్ల ఇది సూర్యరశ్మిని గ్రహించడంతో పాటు విద్యుత్‌ను నిల్వ చేసుకునే సూపర్ కెపాసిటర్ ఎలక్ట్రోడ్‌గానూ పనిచేస్తుంది. వాస్తవ పరిస్థితుల్లో పరీక్షించినప్పుడు, ఈ పరికరం 1.2 వోల్టుల స్థిరమైన అవుట్‌పుట్‌ను ఇచ్చింది. 1000 సార్లు ఫోటో-ఛార్జింగ్ చేసిన తర్వాత కూడా 88 శాతం సామర్థ్యాన్ని నిలుపుకుంది. తక్కువ వెలుతురు నుంచి తీవ్రమైన సూర్యరశ్మి వరకు అన్ని పరిస్థితుల్లోనూ ఇది సమర్థంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.ఈ ఆవిష్కరణతో పోర్టబుల్, వేరబుల్ పరికరాలతో పాటు విద్యుత్ గ్రిడ్ లేని మారుమూల ప్రాంతాలకు తక్కువ ఖర్చుతో, పర్యావరణహితంగా విద్యుత్‌ను అందించే మార్గం సుగమమైంది. శిలాజ ఇంధనాలు, సంప్రదాయ బ్యాటరీలపై ఆధారపడటాన్ని ఇది గణనీయంగా తగ్గిస్తుంది.

# తారాజువ్వలా ఇషాన్ కిషన్



## గత 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన ఇషాన్
## టి20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా బరిలోకి!?
## అభిషేక్ తో ఇన్నింగ్స్ ప్రారంభించే చాన్స్

టి20 ప్రపంచకప్ 2026 వచ్చే శనివారం ఆరంభం కానుంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టి20 ప్రపంచకప్ జరగనుంది. ఈసారి మెగా టోర్నీలో పాల్గొనే జట్ల సంఖ్య పెరిగింది. మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. భారత్ గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా, పాకిస్తాన్ జట్లు కూడా ఉన్నాయి. ఈ టి20 ప్రపంచకప్ జట్టులో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. 2007లో టి20 ప్రపంచకప్ మొదటిసారి జరగ్గా.. టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. ఇక ఆ తర్వాత 2024లో టి20 ప్రపంచకప్ నెగ్గింది. ప్రస్తుతం భారత జట్టు పటిష్టంగా ఉంది. టి20 ప్రపంచకప్ ముందు ఒక బ్యాటర్ ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. ఇటీవలె న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ రెచ్చిపోయాడు. తిలక్ వర్మ గాయం కారణంగా ఆ సిరీస్‌కు దూరమయ్యాడు. ఫలితంగా భారత జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్ తుది జట్టులోకి వచ్చాడు. మొత్తం 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టాడు. ఒక సెంచరీ.. మరో అర్ధ సెంచరీ బాదాడు.ఇక అదే సమయంలో సంజూ సామ్సన్ పేలవ ప్రదర్శన చేశాడు. ఫలితంగా ఫిబ్రవరి 7 నుంచి ఆరంభమయ్యే టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు సూపర్ ఫామ్‌లో ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకం ఉంచింది. ఇప్పటికే అభిషేక్ శర్మ రూపంలో టీమిండియాకు పవర్ ఫుల్ ఓపెనర్ ఉన్నాడు. అతడికి ఇషాన్ తోడైతే ప్రపంచకప్‌లో టీమిండియాను ఆపడం ఎవరి తరం కాదు. 2023లో ఇషాన్ కిషన్ తారాజువ్వలా దూసుకొచ్చాడు. ఆ ఏడాది జరిగిన ఆసియా కప్‌లో అదరగొట్టాడు. దాంతో వన్డే ప్రపంచకప్ జట్టుకు ఎంపికయ్యాడు. అయితే అతడికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో అవకాశాలు రాలేదు. అనంతరం అతడు తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల రెండేళ్లపాటు ఆటకు దూరమయ్యాడు. అయితే 2025 నుంచి అతడి ఆటతీరు మారింది.గతేడాది జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. సంచరీల మీద సెంచరీలు బాదాడు. తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టాడు. అనంతరం జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో కూడా రాణించాడు. ఫలితంగా అతడికి బీసీసీఐ నుంచి పిలుపొచ్చింది. బ్యాకప్ వికెట్ కీపర్‌తో పాటు బ్యాకప్ ఓపెనర్‌గా అతడిని తీసుకున్నారు.ఇక కివీస్‌తో జరిగిన టి20 సిరీస్‌లో సంజూ సామ్సన్ విఫలం కావడం.. ఇషాన్ కిషన్ రెచ్చిపోవడంతో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ సమీకరణాలు మారిపోయాయి. టి20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.

# డబ్ల్యూపీఎల్‌లోకి చెన్నై సూపర్ కింగ్స్

## సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ వెల్లడి

మహిళల క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్?కే) సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో సీఎస్?కే ఫ్రాంచైజీ డబ్ల్యూపీఎల్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతోంది. తమిళనాడులో జరిగిన 'ఇన్వెస్ట్ ఇన్ తమిళనాడు' సదస్సులో సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని వెల్లడించారు. మహిళల క్రికెట్‌లో పెట్టుబడులు పెట్టడమే తమ మొదటి లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తుల్లో మహిళల క్రికెట్? జట్టులో పెట్టుబడులు పెట్టడానికి ఫ్రాంచైజీకి స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఫ్రాంచైజీ దీర్ఘకాలిక ప్రణాళికల గురించి అడిగినప్పుడు విశ్వనాథన్? ఇలా అన్నారు. "ప్రస్తుతమే ఈ నిర్ణయం అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తులో సీఎస్‌కే తన పరిధిని విస్తరించనుంది. అందులో తొలి ప్రాధాన్యం మహిళల క్రికెట్‌కే ఉంటుంది. కాలక్రమేణా ఇతర క్రీడల్లో కూడా సీఎస్?కే అవకాశాలను అన్వేషించవచ్చు." అని కాశీ విశ్వనాథన్ తెలిపారు. ప్రస్తుతం ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఐదు జట్లు మాత్రమే ఉన్నాయి. అవి ముంబయి, బెంగళూరు, ఢిల్లీ, గుజరాత్, ఉత్తర్?ప్రదేశ్. అయితే చెన్నై, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఇప్పటివరకు మహిళల లీగ్‌లోకి ప్రవేశించలేదు.




# సరికొత్త చరిత్ర సృష్టించిన దీప్తి శర్మ



అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో భారత స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. తన కెరీర్‌లో ఈ అరుదైన మైలురాయిని అందుకోవడం ఇదే తొలిసారి. మరోవైపు టీమిండియా ఓపెనర్ స్మృతి మంధానకు వన్డే ర్యాంకింగ్స్‌లో నిరాశ ఎదురైంది. విశాఖపట్నంలో శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దీప్తి శర్మ అద్భుత ప్రదర్శన చేసింది. కేవలం 20 పరుగులు ఇచ్చి ఒక కీలక వికెట్ పడగొట్టడంతో పాటు పొదుపుగా బౌలింగ్ చేసింది. ఈ ప్రదర్శనతో ఆమెకు 737 రేటింగ్ పాయింట్లు లభించాయి. తద్వారా ఆస్ట్రేలియా పేసర్ అనాబెల్ సదర్‌ల్యాండ్ (736)ను ఒక్క పాయింట్ తేడాతో వెనక్కి నెట్టి దీప్తి అగ్రస్థానానికి చేరుకుంది. 2025 వన్డే ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన దీప్తి, ఇప్పుడు టీ20ల్లోనూ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్, ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వరుస సెంచరీలు బాది 820 రేటింగ్ పాయింట్లతో నంబర్-1 స్థానానికి చేరుకుంది. దీనితో స్మృతి 811 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయింది. అయితే టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మాత్రం స్మృతి మూడో స్థానంలో కొనసాగుతూ తన సత్తా చాటుతోంది. టీ20 బ్యాటింగ్ విభాగంలో జెమీమా రోడ్రిగ్స్ భారీగా పుంజుకుంది. శ్రీలంకపై 44 బంతుల్లో 69 పరుగులతో అజేయంగా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?గా ఎంపికైన జెమీమా, ఏకంగా ఐదు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం టీ20 బ్యాటింగ్ టాప్-10లో స్మృతి మంధాన (3), జెమీమా రోడ్రిగ్స్ (9), షెఫాలీ వర్మ (10) ముగ్గురు భారత క్రీడాకారిణులు ఉండటం విశేషం. భారత పేసర్ అరుంధతి రెడ్డి కూడా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంది. ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 36వ ర్యాంకుకు చేరుకుంది. ఇక ఆల్‌రౌండర్ విభాగంలో దీప్తి శర్మ మూడో స్థానంలో ఉండగా, వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.
సౌతాఫ్రికా ప్లేయర్ సునే లూస్
కూడా బ్యాటింగ్,

# భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షిస్తున్నా..

## భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడి

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ గెలుపు అవకాశాలపై రోహిత్ శర్మ కీలక విషయాలు మాట్లాడారు. హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారని, వారి ఆల్ రౌండ్ నైపుణ్యం, డెత్ ఓవర్ల బౌలింగ్‌కు ప్రాధాన్యతనిచ్చారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని, వికెట్ తీసే బౌలర్లకే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న 2026 టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా గెలుపు అవకాశాలపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మెగా టోర్నీలో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. జట్టులో హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ పాత్ర అత్యంత కీలకమని రోహిత్ నొక్కి చెప్పారు. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా అందించే ఆల్ రౌండ్ బ్యాలెన్స్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు పెద్ద ఊరటనిస్తుందని తెలిపారు. అర్షదీప్ సింగ్ డెత్ ఓవర్లలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడని, 2024 ఫైనల్‌లో అతని ప్రదర్శనను ప్రశంసించారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని పేర్కొన్న రోహిత్.. మంచు ప్రభావం వల్ల ముగ్గురు స్పిన్నర్లతో ఆడటం రిస్క్ అని హెచ్చరించారు. వికెట్ తీయగలిగే బౌలర్లకే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో కుల్దీప్ యాదవ్‌పై సరదాగా వ్యాఖ్యానిస్తూ, "గల్లీ క్రికెటర్‌లా ప్రతి బంతికి అప్పీల్ చేయొద్దు, రివ్యూల విషయంలో నేను కుల్దీప్‌ని నమ్మను" అని చమత్కరించారు. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనున్న ఈ టోర్నీలో భారత జట్టు విజయం సాధించాలని రోహిత్ ధీమా వ్యక్తం చేశారు.




# పాక్ జెర్సీపై ఐఎస్ఐ లోగో.. టీ20 వరల్డ్ కప్ లో మరో వివాదం

టీ20 వరల్డ్ కప్ లో భారత్ తో మ్యాచ్ ఆడబోమని పాకిస్థాన్ జట్టు వివాదం రేపిన విషయం తెలిసిందే. ఓవైపు దీనిపై ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా.. మరోవైపు ఆటగాళ్ల కోసం పాక్ సిద్ధం చేసిన జెర్సీపై మరో వివాదం రేగింది. టీ20 వరల్డ్ కప్ కోసం సిద్ధం చేసిన పాకిస్థాన్ జెర్సీపై అటవీ మేక 'మార్ఖోర్' బొమ్మ కనిపించడంపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఆకుపచ్చ రంగులో ఉన్న జెర్సీపై మధ్యలో నల్లటి రంగులో మార్ఖోర్ చిత్రాన్ని ప్రింట్ చేశారు. పాకిస్థాన్ జాతీయ జంతువు మార్ఖోర్.. అదే విధంగా ఇదే చిహ్నాన్ని ఆ దేశ గూఢచర్య సంస్థ ఐఎస్ఐ కూడా ఉపయోగిస్తోంది. ఈ నేపథ్యంలోనే పాక్ ఆటగాళ్ల కోసం రెడీ చేసిన జెర్సీపై మార్ఖోర్ బొమ్మ కనిపించడాన్ని నెటిజన్లు తప్పుబడుతున్నారు.హిమాలయ ప్రాంతాలు, కారకోరంలోని ఎత్తైన పర్వత ప్రాంతాల్లో మార్ఖోర్ కనిపిస్తుంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అటవీ మేకగా గుర్తింపు పొందింది.




# హెచ్‌సీఏలో నూతన అధ్యక్షుడిగా అమర్‌నాథ్






హైదరాబాద్ క్రికెట్ సంఘం లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుత హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుపై అంబుడ్స్‌మన్ జస్టిస్ సురేశ్‌కుమార్ కైత్ వేటు వేశారు. ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఫోర్జరీ పత్రాలతో ఎన్నికల్లో పోటీ చేసి.. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన అమర్‌నాథ్‌ను కొత్త ప్రెసిడెంట్ గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను బ్లాక్‌మెయిల్ చేశాడన్న ఆరోపణలు రావడం, అలానే సీఐడీ అరెస్టు నేపథ్యంలో జగన్మోహన్‌రావును ఇంతకుముందే హెచ్‌సీఏ సస్పెండ్ చేసింది. దీంతో ఉపాధ్యక్షుడు దల్జీత్‌సింగ్ హెచ్‌సీఏ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంబుడ్స్‌మన్ తాజా తీర్పుతో అమర్‌నాథ్ పూర్తిస్థాయి అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఉప్పల్ స్టేడియంలో నూతన అధ్యక్షుడిగా అమర్‌నాథ్ బాధ్యతలు కూడా స్వీకరించారు.



# తారక్‌తోనే గాడ్ ఆఫ్ వార్

గాడ్ ఆఫ్ వార్ ..టాలీవుడ్ లో ఈ సినిమా చుట్టూ నడుస్తున్న డిస్కషన్ మరే సినిమాకు ఇటీవల కాలంలో జరగలేదేమో. మొదట ఈ సినిమా అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ డైరెక్షన్ లో వస్తుందని ప్రకటించారు. కానీ బన్నీ నటించిన పుష్ప తర్వాత సీన్ మారింది. పాన్ ఇండియా మార్కెట్ పై కన్నేసిన బన్నీ తెలుగు దర్శకులతో సినిమా చేసే ఇంట్రెస్ట్ చూపలేదు. దాంతో త్రివిక్రమ్ ఈ కథని ఎన్టీఆర్ చేయాలనీ డిసైడ్ అయ్యాడు. ఎన్టీఆర్ కు కథ చెప్పడం అందుకు ఓకే చెప్పడం కూడా జరిగింది. ఎన్టీఆర్ కూడా కుమారస్వామికు సంబంధించి బుక్ ను చదువుతూ మీడియా కంటపడంతో త్రివిక్రమ్ ఎన్టీఆర్ సినిమా ఫిక్స్ అని న్యూస్ హల్ చల్ చేసాయి. యుద్ధానికి అధిపతిగా, దైవ స్వరూపంగా తారక్ నటన మరియు ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇంతకుముందు ఎన్నడూ చూడని విధంగా ఒక విజువల్ గ్రాండియర్‌గా త్రివిక్రమ్ ఈ కథను సిద్ధం చేసాడని టాక్ వినిపించింది. కానీ మొన్నామధ్య ఈ సినిమాని అల్లు అర్జున్ చేయాలనుకుంటున్నట్టు బాలీవుడ్ మీడియాతో ఫేక్ ప్రాపగాండా చేశారు. దాంతో అసలు ఈ సినిమా ఎవరితో ఉంటుందా అని కన్ఫ్యూజ్ అయ్యారు సినిమా ప్రేక్షకులు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా అన్ని గందరగోళాల తర్వాత చివరికి తారక్ వద్దకు వచ్చి చేరింది. ప్రస్తుతం ఎన్టీఆర్ చేస్తున్న ప్రశాంత్ నీల్ సినిమా జూన్ 2026 నాటికి పూర్తి కానుంది. ఆ వెంటనే అంటే 'గాడ్ ఆఫ్ వార్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ లోపు త్రివిక్రమ్ ప్రస్తుతం చేస్తున్న వెంకీ సినిమా పూర్తి చేసి, ఈ పౌరాణిక చిత్రం కోసం ప్రీ-ప్రొడక్షన్ పనులను పక్కాగా సిద్ధం చేస్తున్నారు. హారిక హాసిని క్రియేషన్స్ మరియు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ సినిమాను పాన్-వరల్డ్ స్థాయిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాయి.

# భాగ్యశ్రీ 'పానీపూరి' పంచ్

అందం ఉంది... ప్రతిభ ఉంది.. కానీ లక్ కలిసి రావడం లేదు... దీంతో వరుస ఫ్లాపులు ఎదుర్కొని డీలా పడిపోయింది భాగ్యశ్రీ. అయితే ప్రతి ఫ్లాప్ నుంచి అంతో ఇంతో నేర్చుకుంటున్న ఈ బ్యూటీ ప్రతి సినిమాలో నటన పరంగా షైన్ అవుతూనే ఉంది. సినిమాలు ఫ్లాపులైనా కానీ, నటిగా ఏనాడూ భాగ్యశ్రీ ఫ్లాప్ కాలేదు. అందుకే ఈ భామకు బ్యాక్ టు బ్యాక్ అవకాశాలు వస్తున్నాయి. మాస్ మహారాజా రవితేజ సరసన -మిస్టర్ బచ్చన్- సినిమాతో డెబ్యూ ఇచ్చిన ఈ బ్యూటీ ఆరంభమే పెద్ద ఫ్లాప్ ని ఎదుర్కొంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ సరసన నటించిన -కింగ్ డమ్- మరో పెద్ద నిరాశ. ఇటీవలే విడుదలైన రామ్ పోతినేని -ఆంధ్రా కింగ్ తాలూకా- అయినా తనను గట్టున పడేస్తుందని చాలా ఆశించింది. కానీ మరోసారి నిరాశే ఎదురైంది. ఈ సినిమాకి విమర్శకుల నుంచి ప్రశంసలు వచ్చినా, భాగ్యశ్రీ- రామ్ జంట కెమిస్ట్రీకి మంచి మార్కులే వేసినా కానీ, ఆశించిన స్థాయి విజయం దక్కలేదు. ఇది కేవలం యావరేజ్ గా మాత్రమే మిగిలిపోవడం మరోసారి భాగ్యశ్రీని కుంగదీసింది. వరుస పరాజయాల కెరీర్ లో దుల్కర్ సల్మాన్ సరసన నటించిన కాంత ఫలితం కొంత ఊరట. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద యావరేజ్ విజయం సాధించినా, ఇందులో భాగ్యశ్రీ నట ప్రదర్శనకు క్రిటిక్స్ మంచి మార్కులు వేసారు. భాగ్యశ్రీ ఫ్లాపులు, యావరేజుల్లో నటించినా కానీ తన నటప్రదర్శన విషయంలో నిరాశపరచలేదనే మంచి పేరు తెచ్చుకుంది. ఇప్పటికీ గెలుపుపై పట్టుదలగా కనిపిస్తోంది. హోప్‌ని విడిచిపెట్టలేదు. ప్రస్తుతం అఖిల్ అక్కినేని సరసన -లెనిన్- అనే చిత్రంలో నటిస్తోంది ఈ బ్యూటీ. ఇది విలేజ్ బ్యాక్ డ్రాప్ సినిమా అయినా ఇందులో భాగ్యశ్రీ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉందని తెలుస్తోంది. భాగ్యశ్రీ ప్రస్తుతం సోషల్ మీడియాల్లో స్పీడ్ గానే ఉంది. అయితే ఈ భామ ఎప్పుడూ హద్దు మీరని, డీసెంట్ ఫోటోషూట్లతో అభిమానుల్లో ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది. తాజాగా మరోసారి అలాంటి ఒక ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది.



# ఉస్తాద్.. ఇంకెప్పుడు క్లారిటీ వచ్చేది..?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీ షూటింగ్ పూర్తి చేసుకుని రిలీజ్ కు రెడీగా ఉన్నా.. విడుదల తేదీ మాత్రం ఇంకా ఫిక్స్ కాకపోవడం హాట్ టాపిక్ గా మారింది. ముఖ్యంగా బాబాయ్ కోసం అబ్బాయి వెయిటింగ్ అన్నట్టుగా సినిమా పరిస్థితి మారిందన్న చర్చ ఇండస్ట్రీలో వినిపిస్తోంది.

ముందుగా సినిమాను సమ్మర్ లో విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఆ మేరకు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా పూర్తి చేస్తున్నారు. రీసెంట్ గా దర్శకుడు హరీష్ శంకర్, నిర్మాతలు డబ్బింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. త్వరలోనే పవన్ కళ్యాణ్ కూడా తన డబ్బింగ్ పార్ట్ ను పూర్తి చేయనున్నారని సమాచారం. ఆర్ఆర్, ఫైనల్ మిక్సింగ్ పూర్తయితే సినిమా పూర్తిగా రిలీజ్ కు సిద్ధమవుతుంది.టెక్నికల్ గా అన్నీ రెడీ అయినప్పటికీ అసలు అడ్డంకి రిలీజ్ డేట్ దగ్గరే. మార్చి నెలలో వరుసగా పాన్ ఇండియా సినిమాలు థియేటర్లకు క్యూ కడుతుండటంతో మేకర్స్ తర్జనభర్జనలు పడుతున్నారు. ధురంధర్ 2, టాక్సిక్, ప్యారడైజ్, పెద్ది వంటి భారీ చిత్రాలు ఇప్పటికే తమ తేదీలను లాక్ చేసుకున్నాయి. అంతటి పోటీలో ఉస్తాద్ భగత్ సింగ్ ను తీసుకురావడం రిస్క్ గా భావిస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పెద్ది సినిమా రిలీజ్ డేట్ ఇంకా ఫైనల్ కాలేదు. మార్చి 27న రావాల్సిన ఆ చిత్రం వాయిదా పడే అవకాశాలు ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. దీంతో పెద్ది టీమ్ కొత్త తేదీ ప్రకటించే వరకు ఉస్తాద్ టీమ్ వేచి చూస్తోందని సమాచారం. అంటే బాబాయ్ పవన్ కళ్యాణ్ సినిమా రిలీజ్ కోసం అబ్బాయి రామ్ చరణ్ సినిమా డేట్ క్లారిటీ కోసం వెయిట్ చేస్తున్నట్టు పరిస్థితి కనిపిస్తోంది.పెద్ది వాయిదా పడితే అదే తేదీని ఉస్తాద్ భగత్ సింగ్ లాక్ చేసే ఛాన్స్ ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అందుకే అధికారిక ప్రకటన ఆలస్యమవుతోందని అంటున్నారు. అవుట్ పుట్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా క్వాలిటీపై దృష్టి పెట్టిన మేకర్స్ సరైన రిలీజ్ విండో కోసం ఎదురుచూస్తున్నారు. మొత్తంగా సినిమా సిద్ధంగా ఉన్నా.. సరైన సమయం కోసం ఎదురుచూపులు మాత్రం కొనసాగుతున్నాయి.

# పారిశుద్ధ్య కార్మికురాలు పద్మకు రజనీకాంత్ సత్కారం



సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన ఉదార స్వభావాన్ని, మంచి మనసును చాటుకున్నారు. నిజాయతీగా వ్యవహరించిన ఓ పారిశుద్ధి కార్మికురాలిని ఇంటికి పిలిచి స్వయంగా సత్కరించారు. ఆమె నిజాయతీని మెచ్చి ఓ బంగారు గొలుసును బహుమతిగా ఇచ్చి అభినందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.వివరాల్లోకి వెళితే, చెన్నైకి చెందిన పద్మ అనే మహిళ పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నారు. ఈ నెల ప్రారంభంలో టీ నగర్‌లో విధుల్లో ఉండగా, ఆమెకు ఓ పర్సు దొరికింది. దాన్ని తెరిచి చూడగా, అందులో 45 సవర్ల (తులాల) బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఏమాత్రం ఆశపడని పద్మ, వెంటనే తన పై అధికారులకు సమాచారం అందించి, ఆ బంగారాన్ని పాండీ బజార్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ జరిపి, ఆ ఆభరణాలను అసలు యజమానులకు అందజేశారు.పద్మ నిజాయతీ గురించి తెలిసి పలువురు ఆమెను ప్రశంసించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్వయంగా ఆమెను అభినందించి, లక్ష రూపాయల చెక్కును బహుమతిగా అందించారు. తాజాగా ఈ విషయం తెలుసుకున్న సూపర్ స్టార్ రజినీకాంత్, మంగళవారం పద్మను తన నివాసానికి ఆహ్వానించారు. ఆమె నిజాయతీని ప్రశంసించి, ఓ బంగారు గొలుసును బహూకరించారు.పేదలకు కేవలం ఐదు రూపాయలకే పరోటాలు అమ్ముతున్న మధురైకి చెందిన తన వీరాభిమాని రజనీ శేఖర్‌ను కూడా రజనీకాంత్ కొన్ని రోజుల క్రితం ఇలాగే బంగారు గొలుసుతో సత్కరించిన విషయం తెలిసిందే.ఇక సినిమాల విషయానికొస్తే, రజనీకాంత్ ప్రస్తుతం నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్ 2' సినిమా పనుల్లో ఉన్నారు. దీంతో పాటు, దర్శకుడు సిబి చక్రవర్తితో చేయబోయే సినిమా షూటింగ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమవుతుందని ఆయన ఇటీవలే పొంగల్ పండుగ సందర్భంగా వెల్లడించారు. కమల్ హాసన్ నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

# రెయిన్ మ్యాన్ అంటూ ఆటపట్టించేవారు: మాధవన్

ఇటీవల 'ధురంధర్'లో కనిపించి ఆకట్టుకున్న నటుడు మాధవన్.. ఆ సినిమా షూటింగ్‌లో అందరూ తనను 'రెయిన్ మ్యాన్' అని పిలిచేవారని తెలిపారు. తాను ఎప్పుడు సెట్‌కు వెళ్లినా వర్షం పడేదని అందుకే అందరూ తనను అలా పిలిచేవారని చెప్పారు. ఆ సినిమాలో ఎక్కువ సన్నివేశాలు ఎండ లేకుండా తెరకెక్కించినవేనని.. అవే సినిమాకు మరింత అందానిచ్చాయని తెలిపారు. ఇకపోతే తన గ్యాప్‌పై ఆయన వివరాఉల పంచుకున్నారు. విశ్రాంతి అవసరం అనిపించి నాలుగేళ్లు విరామం తీసుకున్నట్లు నటుడు మాధవన్ ÷ప్పారు. 2011 నుంచి 2015 వరకూ విరామం తీసుకున్న ఆయన 2016లో 'సాలా ఖదూస్'తో తిరిగి అలరించడం ప్రారంభించారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి పంచుకున్నారు.

'నేను చేస్తున్న పనిపై నిరాశ కలిగింది. అందుకే కొన్ని రోజులు విరామం తీసుకోవాలని భావించా. నాలుగేళ్లు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్నాను. కనీసం ప్రకటనల్లో కూడా నటించలేదు. దేశంలో పర్యటించాను. గడ్డం పెంచుకొని చెన్నై చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు భారత్‌లోని ఎన్నో అందమైన ప్రదేశాలకు వెళ్లాను. అక్కడ రిక్షా వాళ్ల దగ్గరనుంచి ప్రతిఒక్కరితో మాట్లాడాను. వాళ్ల జీవనశైలి, వారిని ఇబ్బందిపెట్టే విషయాల గురించి తెలుసుకున్నా. ఆ నాలుగేళ్ల పర్యటన నాకు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పింది' అని మాధవన్ అన్నారు. విరామం తర్వాత చేయాలనుకున్న పాత్రలపై మరింత స్పష్టత వచ్చిందని మాధవన్ అన్నారు. తాను తిరిగి వచ్చిన తర్వాత ఇండస్ట్రీలో కొందరు దర్శక నిర్మాతలకు



ముందుచూపు లేదని తెలుసుకున్నట్లు చెప్పారు. అప్పటి నుంచి కొత్త దర్శకులను వెతుకున్నట్లు వెల్లడించారు.

# 'మన శంకర వరప్రసాద్ గారు' ఓటీటీలోకి




ఈసారి సంక్రాంతి బరిలో మెగాస్టార్ సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు' బ్లాక్ బస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీసు రికార్డులను కొల్లగొడుతూ భారీ కలెక్షన్లు రాబట్టింది. ఇప్పటి వరకు ఈ సినిమా కలెక్షన్లు రూ.400 కోట్ల మార్క్ ను చేరినట్లు సమాచారం. ప్రాంతీయ సినిమాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన మూవీగా 'మన శంకరవప్రసాద్ గారు' రికార్డుల కెక్కింది. సినిమా విడుదలై మూడు వారాలు గడుస్తున్నా కలెక్షన్లు మాత్రం తగ్గలేదని తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్ లో తెరకెక్కిన ఈ సినిమాకు మొదటి షో నుంచే మంచి టాక్ వచ్చింది. సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాలో హీరోయిన్ గా నయనతార నటించింది. అతిథి పాత్రలో విక్టరీ వెంకటేశ్ కూడా ఈ సినిమాలో కనిపించారు.క్యాథరీన్ థెరీసా, సచిన్ ఖేద్కర్, హర్షవర్ధన్, అభినవ్ గోమఠం, శరత్ సక్సేనా తదితరులు వివిధ పాత్రల్లో నటించారు. థియేటర్లలో బ్లాక్ బస్టర్ గా నిలిచిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను జీ 5 సొంతం చేసుకుంది. ఈ నెల 11 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

Printed , Published and Owned by Marepally Ashok, Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar,